
## వంటింటి లెక్చర్లు (12)

# 'సరస సామదాన....'

"సరస సామదాన భేదదండ చతుర" అనే కీర్తన వింటూ పోస్టు మ్యాన్ కేకకు వంపు దగ్గర బట్టలకు సబ్బు పట్టిస్తున్న చేతుల్ని తుడుచుకుంటూ లేచిన నేను ఒక్క-క్షణం నడుంనొప్పికి "అబ్బ" అని మూలుగుతూ. రిజిష్టర్ ఉత్తరాలమీద సంతకం చేసి ఆ కవర్లు విప్పకుండానే బాత్రూంలో పీటపై చతికిలబడి, "యింత చేశావా భగవంతుడా" అని వుసూరుమంటూ "వాషింగ్ ది థర్టీ 'లెనిన్ ఇన్ ప్రయివేట్' ప్రారంభించాను. కాని మనసు సబ్బు నురగమీదకాని బట్టలమీంచి కారుతున్న మురికిమీదకాని లేదు. ఈ మురికి బట్టలను సోపు పట్టించి ఉతుకు తున్నట్లుగా ఎవరైనా 'డండా' (బట్టలుతికే కఱ్ఱ) తీసుకుని సామాన్య ప్రజల్ని ఇబ్బంది పెట్టేవారిని వుతికేస్తే బాగుండును అనిపించింది. నాపట్టుకు నాకే— ఎందుకంటే ఆ వచ్చిన రిజిష్టరు ఉత్తరాలలో, డ్రాఫ్ట్‌లో, చెక్కు-లో వుంటాయి. అవి బ్యాంకుకు తీసికెళ్తే అక్కడి రాక్షసులు "ఇహ్హిహీ యిప్పుడు మేం సమ్మె చేస్తున్నాం— మీ చెక్కులు మీ దగ్గరే దాచుకోండి. పుచ్చుగోం అని మన మొహంమీదే విసిరేస్తున్నారు - నిర్లజ్జగా, నిర్లక్ష్యంగా, వాళ్ళ జీతాలు వాళ్ళకొస్తున్నాయి అంచేత ఈ నిర్లక్ష్యం - అంటే బ్యాంకులో పనిచేసేవారికి మేనేజిమెంట్లతో తగువులొస్తే ప్రజల్ని "కేరే జాట్"గా చూస్తారని సమాజంపట్ల వారికేమీ బాధ్యత లేదనీ తిరిగొచ్చిన

డ్రాఫ్టులు, చెక్కుల దొంతర చూస్తే ఎవరికైనా యిట్టే "ఈజీ"గా తెలి సొస్తుంది.

సిగ్గూ శరం వదిలేస్తే బరితెగించడం ఎంత సేపు ? ప్రజల సొమ్ము తింటూ వారి కళ్ళల్లో కారం కొట్టేవారిని 'వర్కర్స్తైనా, బాసెస్తైనా' క్షమించకూడదు, ఉరుమురిమి మంగలంమీద పడ్డట్టు తమలో తాము అంత రంగికంగా తగవులాడుకుని బ్యాంకుపనుల కోసం వచ్చే ప్రజలను గడ్డి కరిపించటం "ఇర్రెస్పాన్సిబుల్ వ్యక్తులు చేయవలసిన పని."



యస్జీవోలు పాపం శాశ్వతంగా ప్రజల సానుభూతి కోల్పోయారు. ఇప్పుడు మళ్ళీ బ్యాంకులంటే "అసహ్యం" ప్రజలలో కలిగింది. ఎంచేత నంటే "బ్యాంకింగ్ వ్యాపారమంటేనే సొమ్ము ఒకరిది, సోకు మరొక డిది"–బ్యాంకులవారు యితరుల సొమ్ములతో సోకు లెక్కువ చేసుగుంటే కన్నుపోయేటంత కాటుక పెట్టుగున్నట్లవుతుంది. దేశంలో వ్యాపారాన్ని స్తంభింపచేసి ప్రజలకు నష్టం కలిగించటం "క్రిమినల్ అఫెన్సు" కాదా ?

(12)

బ్యాంకుల్లో పనిచేసేవాళ్ళు మిడిల్ క్లాసువాళ్ళో మిడిల్ క్లాసు నైతికంగా పతనమయిపోబట్టే బాధ్యతారహితంగా "ప్రజలకు" యిబ్బంది కలిగిస్తున్నారు. బాసెస్ ఆరాల్వేజ్ యాసెస్. నా మట్టుకు నేను-ఫిక్సెడ్ డిపాజిట్ ఎందుకు వేసుకున్నాన్రా దేవుడా. కరెంటక్కౌంటు ఎందుకు ఓపెన్ చేశాన్రా తండ్రీ. చెక్కులూ, డ్రాఫ్టులూ ఎందుకు వస్తున్నాయిరా నాయనా అని—"అశోకవనము సీత, శోకించే వియోగము చేత" అన్నట్లు యేడుస్తున్నాను.

ఈ బ్యాంకుల వాళ్ళకు అందరికంటె ఎక్కువ జీతాలు వున్నాయా లేదా! వున్నాయి. వున్నాయి. వీరు ఏర్ కండిషన్ గదుల్లో ముస్తాబై పని జేస్తున్నారా లేదా? చేస్తున్నారు, చేస్తున్నారు. రోగాలొచ్చాయని చెప్పి దొంగ మెడికల్ బిల్లులు రాసి డబ్బు గుంజుతున్నారా లేదా ? గుంజుతున్నారు, గుంజుతున్నారు, ఇళ్ళఅద్దెల అలవెన్సులు బాగా (ఫర్నిషుడు లాడ్జింగ్స్‌తో) ముడుతున్నాయా లేదా? ముడుతున్నాయి, ముడుతున్నాయి. ఇదంత ఎవడబ్బ సొమ్మని వారు అనుభవిస్తారు? వాళ్ల అబ్బ సొమ్మనే — మరింకా ఏం కావాలంటారు? ఇంకా ఎక్కువ సదుపాయాలు, తక్కువ పని. ఎక్కువ సుఖాలు, తక్కువ బాధ్యతలూ, బరువులూ కావాలని ఎవరుమట్టుకు కోరుకోరు? ఆడవాళ్లు కూడా పిల్లల్ని కనే బాధ్యత లేకుండా తప్పించుకోగలిగితే కనకుండా పిల్లలు దొరికితే బావుండ్ను అనుకుంటారు.

పోస్టాఫీసు వారికంటె, రైల్వేవారి కంటె, టీచర్లు, లెక్చరర్లకంటె, ప్రిన్సిపాలుళ్ళ కంటె బ్యాంకుల్లో గుమస్తాలు వగైరాలు మెరుగ్గా చల్లగా హాయిగా వున్నారు. హాయిగా వున్నవాడు, సుఖపడుతున్నవాడు, నలుగురికంటె సమాజంలో బాగా బతుకుతున్నవాడు ఛస్తే ఆ విషయం ఒప్పుకోడు. ఇంకా లేదని ఏడుస్తాడు. (గురూగారు చెప్పినట్టు వేతనకర్చల మనస్తత్వమే అంత వాడికో బంగారు కాసొస్తే మనకో రాగి డబ్బయినా రావద్దా? రావాల్రావాలి.)

ఇలాటి వాళ్లనే 'ఎనిమీస్ ఆఫ్ దపీపుల్' (ప్రజా శత్రువులు) అంటారు. సమ్మె పేరిట సామాన్య ప్రజలకు యిబ్బంది కలిగించి తమ నీచత్వాన్ని సిగ్గు లేకుండా ప్రదర్శిస్తున్న చీడ పురుగుల్ని ఏరేసే రోజూ ఎల్లనూ వస్తుంది. ప్రజాస్వామిక ప్రభుత్వాలు గాజులు తొడిగించుకు కూర్చుంటే, ప్రతి స్వల్ప విషయానికీ కేంద్రంవైపు వెర్రిమొహం లేసుకుని చూస్తూంటే, నలికెళ్ల పాము కూడా ఆదిశేషుడులా బుసలు కొడుతుంది. ఎలిక కూడా సింహంలా గర్జిస్తుంది ? అదిసూకరం కూడా మహా గజంలా ఒళ్లువిరుచుకుని తిరుగుతుంది. గ్రామ దేవత కూడా కలకత్తా కాళీనను కొంటుంది.

ఇప్పుడు మనదేశంలో ఏ రంగంలో చూసినా కనకపు సింహాసన మ్ములో శునకాలే కూర్చొనున్నాయి. అవి వెనకటి గుణం మానలేవు. మేం ప్రజాసేవ చేస్తాం, ప్రజాసేవ చేస్తాం. అని చెప్పుకోటానికి కూడా సిగ్గూ ఎగ్గూ లేకుండా పోతోంది. దేశంలో ఎమర్జన్సీ ఎత్తకుండా నేను మన కాళ్లకిందకి నిప్పులు పోస్తున్న యీ ముఠాకి దేశద్రోహులని ముద్దుపేరు పెడితే-దేశద్రోహులున్న పదాన్ని అగౌరవించి నట్లవుతుందా —

ఇలా తీవ్రాతి తీవ్రమైన ఆలోచనలతో బట్టలన్నీ చిరిగిపోయేలా బాది బాది వుతికి మంచంమీద పడ్డాను. మావారొచ్చి చెప్పారు- రేపు జీతా లావుట-బ్యాంకుల దెబ్బలాటలవల్ల చెక్కులేవీ మారలేదట - చెక్కుల్ చెక్కు చెదరకుండా వున్నాయి.

రేపు పాలవాడొస్తాడు, కరెంటు వాడొస్తాడు, బట్టల వాడొస్తాడు, రజకు డొస్తాడు, ఇంటద్దె వాడొస్తాడు, కూరల వాడొస్తాడు, పచారీ సరు కుల వాడొస్తాడు, కారియర్లు మోసే అమ్మాయొస్తుంది, మందుల షాపు వాడొస్తాడు, కరివేపాకమ్మి వస్తుంది, పేపర్ బోయొస్తాడు....ఇంతమందికి ఏం చెప్పాలి, ఏం చెప్పాలి? ఆర్థిక వ్యవస్థను గుప్పెట్లో పెట్టుకుని నాటకా

లాడుతున్న వాళ్ల మనస్తత్వాన్ని తిట్టుకుంటూ మంచినీళ్ళు నోట్లోపోసుకుని దుప్పటి పీకదాకా ముసుగెట్టుకుని పడుకున్నాను.

మనదేశంలో పతివ్రత లెవరైనా వుంటే వాళ్ళు రేపు తెల్లవార కూడదని శాపం పెడితే ఎంత బాగుండును? పోనీ యీ యిబ్బందులకు కారణమైన వారిమీద శివుడెందుకు మూడోకన్ను తెరవకూడదు. విష్ణుమూర్తి చక్రం అడ్డువెయ్యరాదూ? యూజ్‌లెస్ గాడ్స్—అంతా మనసొమ్ము తినేవాళ్ళే-ఒక్కదేవుడూ సమయానికి తన ప్రజ్ఞ చూపించడు? మేన్‌గాడ్స్ ఆరాలోన్స బ్రూట్స్....